

ఆంతర్యాలు

శ్రీ వంగల వేణుగోపాల

శవులంటే అందరిలాంటి వ్యక్తి కాదు. సమస్తమూ యెరిగినవాడు. భగవంతుడన్నా, భాగవతులన్నా, సాష్టాంగపడి సాపాటుకి పిలుస్తాడు. మళ్ళీ లౌకికరీత్యా, యివేవీ లెక్కచెయ్యడు (ఆయన ఆ ఊళ్ళోనే ఆడపిల్లల బడిలో మేష్టరు లెండి) సూర్యోదయంతో లేచి, స్నాన సంధ్యాదికృత్యాలు చక్కగా నెరవేర్చి, ఆంగ్లేయుడిచ్చిన అరకప్పుడు బార్లీ జావా తాగేసి (డాక్టరు తాగమన్నారు లెండి) తెల్లటిపంచ, కోటు, క్షీరాబ్ధిపట్టుకండువాలతో, ఫాలంమీదిపట్టెవర్ధనాలతో అంతటి మనిషి అల్లా నడిచి వెడుతుంటే బడిపిల్లలంతా హడలెత్తేవారంటే నమ్మండి. ప్రతి వారితోను తూచితూచి మాట్లాడుతాడు. పాపం! కష్టవంతి గుమ్మడి కత్తిపీటకి లోకువయినట్టు, యింతటి కేశవులు తన బావగారికి యిట్టే లొంగిపోయి ఊరుకున్నాడు.

బావగారు మాత్రం సామాన్యులా. ఆయన ఉభయభాషల్లో పండితులు. ఆశుకవిత కందుకుంటే అంతం చూసేదాకా వదలరు. తరతరాలుగా తమకున్న శిష్యసంచారం జేస్తూ, స్వగృహంలో (యిప్పటికి కేశవుల యిల్లే అనుకోండి) అతి శ్రద్ధగా పెరుమాళ్ళసేవ, నిత్యనైవేద్యం, నీరాజనాలు జరుపుతూ, ఒకవిధంగా కేశవులకి గురుసమానులయ్యారు. కేశవుని భగవద్భక్తి, రక్తీ చూసి ముచ్చటపడి (అల్లా అని ఆయననే చాలసార్లు అన్నారులెండి మరి) వీలయినపుడల్లా యితని యింట్లోనే వేంచేస్తూఉండేవారు. దీని మూలాన్ని కేశవులకి కొంత అప్పయిందనికూడ వినికిడి. దానికేంగాని కలసిఉన్నన్నాళ్ళు, వారే వీరు, వీరే వారుగా కాలక్షేపం చేశారంటే నమ్మండి. కొంత కాలానికి, లోకం వెధవది, ఏదో అనుకుంటోందని బావగారు అప్పుడప్పుడు కేశవులకి పదో పరకో, ముట్టజెప్తూ ఉండేవారు. తరువాత అప్పుడప్పుడు, మీరిచ్చే పైకం, మీ నౌకరు తినే పప్పుముద్దకి చాలదని వాళ్ళువీళ్ళు అన్నారట. యిల్లాగ అరమరిక లేకుండా ఉండగా, కాలక్రమేణ బావగారు కొంచెం డబ్బు వెనకెయ్యడం, ఆ తర్వాత అదనుచూసి, పదునైన గృహం టపీమనికొనెయ్యడం, అందులో ప్రవేశించడం కూడ జరిగిపోయింది. అప్పటికీ ఆ రెండిళ్ళకీ రాకపోకలు సాగుతూనే ఉన్నాయ్. కాని కేశవులు చేసిన ఒక చిన్నపనిలో (మన దృష్టిలో) అవన్నీ బందయిపోయాయి.

ఇందాకే మనవిచేశానుకదండీ, కేశవులు లౌక్యంలో ఏదయినా ఖాతరుచేయడని. బడిఉంచిన యిల్లంతా శిథిలమయి, వానకీ, గాలికీ పిల్లలని తారెత్తించేది. పిల్లలుగల కేశవులు ఆ గుంటల బాధ చూడలేక బిల్డింగు మార్చవలసినదంటూ బోర్డువారికి విన్నపం చేశాడు. అది ఓ పట్టాన తెమిలింది. గాలికీ, వానకీ విన్నపాలు వెళ్ళగా వెళ్ళగా, ఓ సుముహూర్తాన స్కూలు బిల్డింగు మార్చవలసిందంటూ బోర్డువారు హుకుం జారీ చేశారు. హుకుం అయితే జారీ అయింది కాని యిల్లు ఎక్కడుంది? యిల్లుంటే ఆవరణ లేదు. ఆవరణ ఉంది అనుకుంటే ఇల్లు చాలదు. రెండు కుదిరితే బోర్డువారు భరించరానిఅద్దె. ఈఖండసమస్యకి ఒక్కటే ఉపాయం తోచింది కేశవులుకి. తనదీ పెద్దయిల్లే విశాలమయిన సావిడి, వసారగదీ, వడమటగది పెద్దఅరుగులూ బడికియిచ్చేస్తే బాగుంటుంది అనుకున్నాడు. దొడ్లో లంకంత పాకఉంది. పడమటింటి వసారా దొడ్డి, యింట్లోవాళ్ళకి చాలుననుకొని, బడికి కొంత ఆవరణ వదలి, దొడ్లో దడి కట్టేశాడు. దాంతో యిల్లో లోకము, బడి మరో లోకము అయింది. పడమటింటిలోని పెరుమాళ్ళని దొడ్లో పాకలో ప్రవేశపెట్టారు. యింతవరకు అంతా బాగానే ఉంది. ఆయన బళ్ళో ముగ్గురు ఆడటీచర్లు ఉన్నారు. వాళ్ళు క్రైస్తవులు. యిక్కడే వచ్చింది చిక్కు.

చిక్కేమిటి మహాపరాధం. 'భాగవతులు మసలేచోటమాలసంపర్కమా. పెరుమాళ్ళని సేవించినచోట మ్లేచ్ఛులు తిరగ



టమూ' అంటూ తెగుల్కొన్నారు బావగారు. కేశవులు మాత్రం తక్కువ తిన్నాడా? పెరుమాళ్లు ఎక్కడో దొడ్లో మూల పాకలో ఉన్నారు. వారికీ బడిలో మనష్యులకీ సంబంధం లేదు. బడిబట్టలతో పిల్లలు కూడ పాకలోకి రారు. కనుక ఫరవా లేదు అంటాడు. యీ అనుకోవడాలన్ని ఉత్తరాల మూలంగానే అనుకోండి. అయితే నేం?...ముఖస్తంగాకంటె ఘాటుగానే అనుకున్నారు.

ఆ తర్వాత కేశవులుకి ఒక శ్రీముఖం వచ్చింది. 'యింటిలో మాలటేచర్ల బడి పెడుతూ, మత పవిత్రతకి భంగం సహించావు కనుక, యికముందు నీయింటికి మా రాకపోక లుండబోవు' అని మంగళాశాసన పురస్సరంగా వ్రాయించారు బావగారు. దాన్ని చదవగానే కేశవుల గుండెల్లో రాయి పడింది. ఎంతయినా వియ్యాంకుడు (మేనరికం యిచ్చాడులెండి) అయినా మరుక్షణం మనస్సు రాయిజేసికొని 'యీ వెధవ రోజుల్లో పాతికరూపాయిలు అద్దె రూపంగా వస్తుంటే ఎల్లా వదులుకుంటాను. ఒక్కదమ్మిడీ, ఎర్రనివీగాని, ఎవడయినా యిస్తాడూ? అయినా నాకు మాత్రం భగవద్భక్తి లేదూ? అందుకనేగా, పెరుమాళ్లకి సంపర్కదోషం లేకుండా పాకలో వేంచేయింప చేశానూ! అయిందేలాగ అయింది, నేను యింట్లోంచి బడి తీసెయ్యను. వచ్చినవాళ్ళే వస్తారు,' అని తెగించాడు కేశవులు. యిల్లా అని ఉత్తరం రాయలేదనుకోండి.

కాలం ఒకరీతిగా గడవదుకదండీ. బావగారి రెండో పుత్రుడి వివాహకాలంలో అధ్వర్యం అంతా కేశవులిదే. ఆ తర్వాత జరిగిన మనమరాలికి పుట్టువెంట్రుకలు తీయించడం కూడ యితని పెత్తనం కిందే జరిగింది. కొంతమందికి (కావలసిన వాళ్ళే అనండి) అయిష్టమయినా లెక్క చేయలేదు. కాని యిద్దరికీ గుండెల్లో మండుతూనే ఉంది. ఎదురుగా కాకపోయినా పరోక్షంగానైనా వాటి తాలూకు పొగలు విజృంభిస్తూనే ఉన్నాయ్. ఆ మధ్య జరిగిన వైష్ణవ సభల మూలంగా కేశవులున్న గ్రామప్రాంతాలకి వచ్చి కూడ కేశవుల యింటికి రాకుండా వెళ్ళేవారు బావగారు. అంతదాకా ఎందుకూ? ఆ ఊళ్లోనే పక్క వీధిలో సభలకి వచ్చి, యింటి గుమ్మం తొక్కకుండా, అల్లాగే వెళ్లిపోయిన ఘడియలు రెండో మూడో ఉన్నాయ్.

దాంతో 'యిక ఆయన యింటికి మనం వెళ్ల డాలుకాని, ఆయనమాత్రం నాయింటికి రాడు, అని నిర్ణయానికి వచ్చాడు కేశవులు. యీ గడ్డురోజుల్లో వచ్చే పాతిక రూపాయలు వదులుతాడా యీ బావగారి అతిఛాందసాన్ని మన్నిస్తాడా? బడి యింట్లో ఉండటంమూలాన్ని కనపడని లాభం ఒకటి కేశవులు మరచిపోలేదు. బడి లేని గంటల్లో, బల్లలు, బెంచీలు, కుర్చీలన్నీ యింటి-ఫర్నిచరే నలుగురు చుట్టాలొచ్చినా, రెండు బల్లలు సర్దేసి, దుప్పటి పరుస్తే మంచాలు తక్కువయిన లోటు కనపడేదికాదు. యిల్లా యిహపరాలుగా లాభిస్తున్న యీ బడిని యింట్లోంచి తీసెయ్యడానికి సామాన్యసంసారి, కేశవులుకి యిష్టం లేదు.

ఆ వేళ ఆదివారం సెలవురోజు అవడం మూలాన్ని కేశవులు సావిట్లో ఏదో రికార్డు వ్రాసుకుంటున్నాడు. పిల్లలు బల్లలెక్కి గొడవగా ఆడుకుంటున్నారు. ఇంట్లో అంతా అప్పుడే తిళ్లుతిని లోకాభిరామాయణానికి కూర్చున్నారు. అల్లాంటి సమయంలో హఠాత్తుగా, ఆకాశాన్ని చీల్చుకొనిపడ్డట్టు, ఊడిపడ్డారా బావగారు. మంచిఎండలోంచి వచ్చారేమో ఒళ్ళంతా స్నానం చేసినట్టు చెమటలోడుతోంది. ఆయాసంతో రొప్పుతున్నారు. హఠాత్తుగా యింట్లోకి రావడంతో కళ్లు కాస్సేపు చీకట్లుకమ్మి, కొంతసేపటికి సర్దుకోగా మెల్లిగా ఆ ప్రక్కనేఉన్న బెంచిమీద ఆసీనులయ్యారు బావగారు. అకస్మాత్తుగా

కుష్టు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

జరిగిన ఆయన రాకకి కేశవులు నిర్ఘాంతపడి పోయాడు. కాస్త తమాయించుకున్నాక, 'సాపాటుకి లేవండి' అందామనుకున్నాడు. కాని వెనక జరిగిన రాద్ధాంతం గుర్తుకొచ్చి కాని ఏమీ అనడానికి తోచక తటపటాయిస్తున్నాడు కేశవులు. బావగారి మొహంమీద బొట్టు లేకపోవడం, యింకా ఆయన స్నానంకూడా చెయ్యలేదని బుజువు చేస్తోంది.

కాని కేశవుల శేవిమీ పాలుపోవడం లేదు.

కాస్సేపు నిమిషాలు చూసి 'నేను స్నానం చెయ్యాలి' అన్నారు బావగారు. దాంతో సూచన గ్రహించి, దొడ్లో ఉన్న నూతికి ఒక్క గెంతేసి, గుండిగనిండా నీళ్లుతోడి, పాకలో దణ్ణాన్ని వేళ్లాడే రెండు గావంచాలు లాగుకొని, 'ఒసేవ్ యిల్లారా' అని ఏంచెయ్యాలో అర్థంకాక తటపటాయిస్తున్న అర్థాంగిని వంటకి పురమాయించి, బావగారిని స్నానానికి లెమ్మన్నాడు కేశవులు. బావగారు స్నానంచేసి, అమర్చిన చిత్రాసనంమీద అనుష్ఠానాలు తీర్చుకొని, కులాసా కబుర్లుచెప్పుతూ, నవ్విస్తూ, నవ్వుతూ ఆనాడు సాపాటు చేశారు. దాంతో యిక ఆ రెండిళ్లకీ మళ్లా రాకపోక లేర్పడ్డాయనుకోండి.

ఇంతకీ అనవచ్చే విషయం ఏమిటంటే, తిరిగి బావగారే స్వయంగా కేశవుల యింట్లో సాపాటుచేసే అవకాశం ఎల్లా కుదిరిందోనని. అది మనకీ తెలియదనుకోండి. కాని శ్రీరంగమంతటి దివ్యక్షేత్రాల్లోకూడ హరిజన ప్రదేశమయిందే. యిక ఎక్కడో పాకలో ఉన్న పెరుమాళ్లకి సాపిట్లోని మాలటీచర్ల సంపర్కదోషం (ఒకవేళ తగిలితే) తలిగినా ఫరవాలేదని బావగారనుకున్నట్టు మన అభిప్రాయం. అయితే చాలకాలం, అంటే మొన్నమొన్నటిదాకా కేశవుల యింట్లో నే కాపరంఉండి, కొత్తయిల్లు రాగానే, దెబ్బలాడి విడిపడ్డారని అంతా అనుకుంటారను కాని ఆయనే స్వయంగా యిల్లా చేసి ఉంటారని మాలవర్గాలవారిద్వారా వినికి. దానికేంలెండి వెధవది. లోకులని కాకుల పేరుగా!!

★

కౌంట్ ఆఫ్ మాంట్‌క్రిస్టో

(19-వ పేజీ తరువాయి)

హోటల్ యజమానికి దాదాపు నలభైఅయిదేళ్లుంటాయి. పొడుగ్గా బక్కపలచగా ఉంటాడు. కొంకినుక్కు, చురుకు చూపులు, చిన్నికళ్లు దక్షిణప్రాంతవాసి అని తెలుపుతున్నాయి. మాంసభక్షణచేసే జంతువుల మాదిరిగా అతనిపళ్లు తెల్లగా మెరుస్తున్నాయి. వయస్సు ముదిరినా అతనికి జుట్టు నెరుపు పట్టలేదు. గడ్డం ఒత్తుగా పెరిగింది. ప్రతిరోజు ఉదయంనించి సాయంకాలం వరకూ అదేపనిగా గుమ్మంవద్ద ఎండలో నిలవడంవల్ల కాబోలు చర్మం కమలింది. తలకు రుమాలు చుట్టుకున్నాడు. ఇతనే కాడరూస్. ఇతని భార్యపేరు రాడెల్. అనారోగ్యంవల్ల చిక్కి, పాలిపోయి ఉంటుంది. లోజ్వరంవల్ల క్రమక్రమంగా ఆమె సౌందర్యం క్షీణించిందని చూడగానే కనిపెట్టవచ్చును. ఎప్పుడూ మిద్దెమీద తన గది విడిచి వచ్చేదికాదు. పక్కపైన పడుకునో, పడక కుర్చీలో ఊగుతూనో నిత్యం సాధిస్తూ భర్తనిఉంటుంది. సాధింపుబాధ తప్పించుకోడానికీ, రహదారి నెవరైనా వస్తూఉంటే చూడ్డానికీ కాడరూస్ ఎప్పుడూ వీధి గడపవద్దనే ఉండేవాడు. భార్య సాధింపులకి అతను చెప్పేదూ ఇచ్చే సమాధానం ఒక్కటే. "చాల్లే ఊరుకో. ఇది మన కర్మం. తప్పించుకోవాలన్నా తప్పదిది." హోటల్‌లో వ్యాపారం ఏమీ లేకపోయినా అది కనీసం అతనికి ఆశ్రయం యిస్తోందని తృప్తి పడుతున్నాడు.

ఆరోజున కాడరూస్ కొల్లవంక చూస్తూ గుమ్మంవద్ద నిలబడిఉండగా, అతనికి భార్య పిలుపు వినవచ్చింది. రోడ్డుపైన అటూఇటూ కనుచూపుమేర చూసి, ఎవరూ రావడంలేదని గ్రహించి కాడరూస్ లోనికి వెళ్లాడు. కాని, అతనక్కడే మరొకక్షణం ఉన్నట్లయితే దూరంనించి గుర్రంపైన వస్తున్న ఒక ఫాదరీ కనపడేవాడే. ఎడారిలాగఉన్న ఈ ప్రాంతంలో ఈ మధ్యాహ్నపు ఎండవేళ సామాన్యంగా ఎవరూ రోడ్డెక్కరు. ఈ కాని వేళ గుర్రపురౌతు వచ్చి హోటల్ వద్ద ఆగాడు. రౌతు గుర్రందిగి, కళ్ళాన్ని తాతకిటికీకి తుప్పుకొచకి కట్టాడు. ముఖాన చెమట తుడుచుకుంటూ ద్వారం సమీపించి తలుపుపైన మూడుమార్లు తట్టాడు. నల్లని పెద్దకుక్క ఒకటివచ్చి అపరిచితుని చూసి మొరగసాగింది. ఇంతలో కర్రమెట్లు టకటక మన్నాయి. హోటల్ యజమానివచ్చి ఆ గంతకుని ఆహ్వానించాడు. కుక్కని అదిలించి "ఇది కరవదులెండి. ఊరికే మొరుగుతుంది. ఫరవాలేదు. దయచెయ్యండి. తమకేం తీసుకుంటారు? ద్రాక్ష సారాయి తెచ్చేదా? ఎండ పేల్చివేస్తోంది," అని, ఫాదరీని నిదానించిచూసి తరవాత, "క్షమించాలి. తమకేం తీసుకుంటారో అదే చెప్పండి," అన్నాడు.

ఫాదరీ అతన్ని వింతగా క్షణంసేపు పరికించాడు. తనని కూడా అతను అలాపరికించడానికి అవకాశమిస్తూ, మాట్లాడక ఊరుకున్నాడు. కాని, కాడరూస్ గుర్తుపట్టిన సూచనలేవీ కనపడలేదు. జవాబివ్వనందుకు మాత్రం ఆశ్చర్యపడ్డాడు. ఫాదరీ అతన్ని సూక్ష్మంగా పరిశీలించి, "మీరేనా కాడరూస్?"

"అవును నేనే" అన్నాడు కాడరూస్ మరింత ఆశ్చర్యపడుతూ, "నాపేరు గాస్పర్డ్ కాడరూస్. తమకేంకావాలి?"

"ఓహో! గాస్పర్డ్ కాడరూస్. అవును. పేరు, ఇంటిపేరు అదే. మైలాన్‌వీథిలో ఇదివరలో మీరు దర్జీవృత్తిలో ఉండేవారనుకుంటాను కాదూ?"

"అవును. కాని, ఆ వృత్తిలో జాస్తిగా కిట్టలేదండి. మార్సెల్స్‌లో వేడి, ఉక్క ఎక్కువవడంవల్ల కాబోలు దర్జీపనివాళ్లు అక్కడ బాగుపడే యోగ్యత లేదండి. వేడంటే జ్ఞాపకం వచ్చింది. గాడ్పు వీస్తోంది. తమరేమైనా చల్లనిపానీయం పుచ్చుకుంటారా?"

"మంచి సారాయం తెచ్చిపెట్టండి. మనం ఇంకా మాట్లాడాలి."

తరుణం తప్పిపోకూడదన్న ఆత్రుతతో కాడరూస్ తనవద్ద ఉన్న సరుకులోకెల్ల నాణ్యమైనది తెచ్చాడు. ఫాదరీ మేజాపై చేతులుంచి కుర్చీలో కూర్చున్నాడు. కుక్క దూరంగా నేలపై పడుకుని ఓరకంట ఫాదరీని గమనిస్తోంది.

కాడరూస్ సీసా, గ్లాసులు తెచ్చి మేజామీద పెట్టాడు. "మీరు ఒంటరిగానే ఉన్నారా? లేక ఇక్కడ ఇంకెవరైనా ఉన్నారా?" అని అడిగాడు ఫాదరీ.

"ఒంటరిగానే ఉన్నానని చెప్పవచ్చునండి. ఏం చెయ్యను? భార్యా ఉంది కాని, సహాయపడదండి. నిత్యం జబ్బే. పాపం."

"ఓ. మీరు వివాహితులన్నమాట" అన్నాడు ఫాదరీ.

"తమరు చూస్తున్నారుగా, నేను భాగ్యవంతుణ్ణికాను. ఎలా కాగలను? నీతివంతుడైనంతమాత్రంచేత ఈ ప్రపంచంలో భాగ్యం రాదు కదండి!"

ఫాదరీ అతనివంక సూటిగా చూశాడు. "అవునండి" అన్నాడు కాడరూస్. "ఏమున్నా లేకపోయినా నేను నీతివంతుణ్ణని మాత్రం చెప్పుకోగలనండి. ఈ రోజుల్లో అమాత్రం చెప్ప